సాక్షి ప్రకాశం

బుధవారం । 26 । మార్చి । 2025



జూదం.. జీవితం ఛిద్రం

ఆన్‌లైన్ జూదాలు, బెట్టింగ్ యాప్‌లతో యువత పెడదారి పడుతున్నారు. ఆశపడి డబ్బులు పెట్టి అప్పుల పాలవుతున్నారు. - IIలో..



ఎన్నికల్లో గెలిచే సత్తా లేకనే..

స్థానిక ఎన్నికల్లో గెలిచే సత్తా లేకనే వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఆంజనేయ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి విమర్శించారు. - IIలో..

గరిష్ఠం/కనిష్ఠం 37/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

బుధవారం ఇఫ్తార్ సాయంత్రం గం 6 : 30

గురువారం సహరి ఉదయం గం 4 : 51

న్యూస్‌రీల్

26, 27న తరల్ ఎండ్‌లైన్ పరీక్షలు

ఒంగోలు సిటీ: సమగ్రశిక్షా రాష్ట్ర కార్యాలయ ఉత్తర్వుల మేరకు 2025–26 సంవత్సరానికి గాను తరల్ ఎండ్ లైన్ పరీక్షను ఈ నెల 26, 27వ తేదీల్లో 3, 4, 5వ తరగతి చదువుతున్న పిల్లలకు తెలుగు, గణితం సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించాలని డీఈఓ కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఓ మాట్లాడుతూ ఈ పరీక్ష నిర్వహించడానికి అవసరమైన సూచనలు, ప్రశ్నపత్రాలు ఇప్పటికే పంపారన్నారు. మండల విద్యాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత ఉపాధ్యాయులకు తరల్ ఎండ్ లైన్ పరీక్ష నిర్వహించడానికి తగిన సూచనలు ఇచ్చి పూర్తి చేయించాల్సిందిగా ఆదేశించారు. తరల్ ఎండ్ లైన్ పరీక్ష నిర్వహణలో కొన్ని ముఖ్యమైన నియమాలను పాటించాలన్నారు. ప్రతి విద్యార్థికి బేస్ లైన్, మిడ్ లైన్ పరీక్ష ల్లో వాడని 4 శాంపిళ్లలో ఏదైనా ఒక శాంపిల్ ను మాత్రమే ఎండ్ లైన్ లో ఇవ్వాలన్నారు. పరీక్ష నిర్వహణ అనంతరం మార్కులు అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ

ఒంగోలు సబర్బన్: ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రత్యేకంగా జీఓ విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్స్‌పల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ జీఓ నంబరు–46 విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అందుకుగాను రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అన్ని మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలకు ఉత్తర్వులు పంపింది. 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఆస్తి పన్ను బకాయిలకు సంబంధించి ఈ జీఓ ఉపకరిస్తుందని ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కే.వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు ఆయన మార్చి 31వ తేదీలోపు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన వారికి ఈ వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. కనుక ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంస్కృతాన్ని రెండో భాషగా కొనసాగించాలి

- ఏపీఎస్ఎల్ఏ ఒంగోలు డివిజన్ సభ్యుల డిమాండ్



ఆర్ఐఓ సైమన్ విక్టర్ కు వినతిపత్రం అందజేస్తున్న సంస్కృతం లెక్చరర్లు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సంస్కృతాన్ని రెండో భాషగా ప్రస్తుతం ఉన్నట్లు కొనసాగించాలని జిల్లా సంస్కృత లెక్చరర్ల అధ్యక్షుడు జి.కృష్ణ, వై.రమేష్ కోరారు. మంగళవారం ఏకేవీకే కళాశాలలో ప్రకాశం జిల్లా సంస్కృత లెక్చరర్ల అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపి, అనంతరం ఆర్ఐఓ సైమన్ విక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సంస్కృతం ఎలా ఉందో అదే విధంగా సెకండ్ లాంగ్వేజ్‌గా కొనసాగించాలన్నారు. వందల, వేల మంది ఉపన్యాసకులంతా ప్రైవేట్ కళాశాలల్లో, కార్పొరేట్ కళాశాలల్లో పనిచేస్తున్నారన్నారు. ఇంతటి విలువైన సంస్కృతాన్ని ఆప్షన్ గా పెట్టాలనే ఆలోచన మంచిది కాదన్నారు. ఆప్షన్ సబ్జెక్టు పెట్టి అది పాస్ అవ్వకపోయినా పరవాలేదు అని అన్నప్పుడు విద్యార్థులు సంస్కృతాన్ని తీసుకోరనీ, ఈ విధానం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రసాదు, శ్రీనివాసరెడ్డి, రఘు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏపీ బీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉమాకాంత్

కనిగిరిరూరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా కనిగిరికి చెందిన మార్లెళ్ల ఉమాకాంత్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఆదేశాల మేరకు సంఘ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రావు నుంచి మంగళవారం నియామక ఉత్తర్వుల్వ వచ్చినట్లు తెలిపారు. ఉమాకాంత్ కనిగిరి బ్రాహ్మణ సంఘానికి రెండు సార్లు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయన నియామకం పట్ల బ్రాహ్మణ సంఘ మాజీ అధ్యక్షుడు మాచవరపు సుబ్రహ్మణ్యం, పరశు సత్యగోపాల్, సంఘ నాయకులు మతుకుమల్లి భాస్కర్, మనోహర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

తెల్లబోతున్నారు..

రేషన్ కార్డుదారుల్లో ఈకేవైసీ టెన్షన్ పట్టుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ వస్తోంది. సూపర్‌సిక్స్ అంటూ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటి అమలును మరిచిపోయింది. తాజాగా రేషన్ కార్డులో పేరున్న కుటుంబ సభ్యులంతా ఈపీఓఎస్ మెషీన్ ద్వారా వేలిముద్రలు ఇచ్చి కేవైసీ పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈకేవైసీ చేయించుకోకపోతే ఏప్రిల్ నెల సరుకులు అందవని అధికార వర్గాలు చెబుతుండటంతో కార్డుదారుల్లో ఆందోళన నెలకొంది. ఈకేవైసీ పేరుతో ఏం కోతలు పెడుతుందోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



డీలర్ వద్ద ఈకేవైసీ చేయించుకుంటున్న కార్డుదారులు

- రేషన్‌కార్డులను తొలగించే ఎత్తుగడ
- ఈకేవైసీకి ఈ నెలాఖరు వరకు గడువు
- రేషన్ డీలర్ల చుట్టూ కార్డుదారుల ప్రదక్షిణలు
- జిల్లాలో 2,08,872 మందికి పెండింగ్

బేస్తవారిపేట: జిల్లాలో 38 మండలాల్లో 1392 రేషన్ దుకాణాల పరిధిలో 6,73,160 రేషన్‌కార్డులు ఉన్నాయి. కార్డుల పరిధిలో 19,37,977 మంది ఉన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లలకు ఉపకార వేతనాలు, సామాజిక పింఛన్లు, విద్య, రాయితీ పథకాలు, ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డు ముఖ్యం కావడంతో లక్షలాది మంది కొత్త కార్డుల కోసం ఎదురుచూపులు చూస్తుంటే నేడు కూటమి ప్రభుత్వం ఆ పని చేయకపోగా ఉన్న కార్డులను తొలగించేందుకు కొత్త ఎత్తుగడలు చేస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వార్డు, సచివాలయ మొబైల్ యాప్, రేషన్ షాపులోని ఈపాస్ పరికరాల ద్వారా ఈకేవైసీ నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్న పిల్లలు మినహా మిగిలిన లబ్ధిదారులంతా ఈకేవైసీ ప్రక్రియను నెలాఖరు లోపు పూర్తి చేసుకోవాలి. లేకుంటే రేషన్ కార్డుదారులకు భవిష్యత్‌లో రేషన్ సరుకులతో పాటు మిగిలిన సంక్షేమ పథకాలు నిలిచిపోయే అవకాశం ఉంది.

కార్డుదారుల ఆందోళన..

అయితే ఈకేవైసీ ఎవరు చేయించుకోవాలనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. దీనిపై ఏ ఒక్కరూ ప్రజలకు అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ఈకేవైసీ చేయించుకోవాల్సిన జాబితాను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తహసీల్దార్లకు అప్పగించారు. తహసీల్దార్ కార్యాలయాల నుంచి రేషన్ డీలర్లకు జాబితాలు పంపిణీ చేశారు. ఈ జాబితాల్లో ఎవరి పేర్లు ఉన్నాయో..ఎవరివి లేవో తెలియక రేషన్ షాపుల వద్దకు కార్డుదారులు పరుగులు పెడుతున్నారు. 70 ఏళ్లకు పైబడిన వృద్ధులకు ఈకేవైసీ నమోదు కావడం లేదు. సర్వర్ సమస్య వేధిస్తోందని డీలర్లు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో జాబితాలో ఉన్న వారికి సమాచారం అందించడంలో తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఐదేళ్లు దాటిన పిల్లలు దూరప్రాంతాల్లో ఉండి చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి పిల్లలతో ఆ ప్రాంతంలో రేషన్ దుకాణం ఎక్కడుందో కనుక్కొని ఈకేవైసీ చేయించాల్సిన పరిస్థితి ఏర్పడంతో తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పొట్టకూటి కోసం వలసలు వెళ్లినవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కనీసం వారికి సమాచారం చేరవేశారో లేదో తెలియని గందరగోళం నెలకొంది.

నియోజకవర్గాల వారీగా...

నియోజకవర్గం	ఈకేవైసీ పెండింగ్
గిద్దలూరు	27,018
ఒంగోలు	22,011
ఎస్ఎన్‌పాడు	19,203
దర్శి	30,036
కొండపి	26,749
కనిగిరి	25959
మార్కాపురం	24,542
యర్రగొండపాలెం	33,354

గడువు లోగా సాధ్యమేనా..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇబ్బడి ముబ్బడిగా డీలర్లను తొలగించారు. కొందరిపై 6ఏ కేసులు నమోదు చేయడం, మరికొందరిని ఎన్‌ఫోర్స్‌మెంట్, రేషన్ డీటీలతో బెదిరించి అన్యాయంగా తొలగించారు. పశ్చిమ ప్రకాశంలో కూటమి నేతలకు లొంగని డీలర్లపైకి కనిగిరి, దర్శి, మార్కాపురం, యర్రగొండపాలెంలో తనిఖీల పేరుతో వేధించారు. రెండు, మూడు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న డీలర్లను తప్పించారు. ఈ నేపథ్యంలో డీలర్లు లేనిచోట ఆధార్ సెంటర్లకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి ఉంది. ఏ మండలంలోనూ ఆధార్ సెంటర్లు సక్రమంగా పని చేయడం లేదు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించలేదు. జిల్లా వ్యాప్తంగా 6,73,160 రేషన్‌కార్డుల పరిధిలో 19,37,977 మంది ఉన్నారు. అందులో ఇంకా 2,08,872 మంది లబ్ధిదారులు ఇంకా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. మరో ఐదు రోజుల్లో గడువు ముగియనుండటంతో ఈకేవైసీపై కార్డుదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెండింగ్‌లో ఉపాధి హామీ బదిలీలు

ఒంగోలు టౌన్: జిల్లాలో జరిగిన ఉపాధి హామీ బదిలీలను అమలు చేయకుండా పీడీ జోసఫ్ కుమార్ పెండింగ్‌లో పెట్టడం చర్చనీయాంశమైంది. ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీల ప్రక్రియ చేపట్టారు. రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల ప్రకారం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 19న బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. 20వ తేదీ ఆర్డర్ రిలీజు చేయాల్సి ఉంది. బదిలీ అయిన ఉద్యోగులు 22లోపు తమకు కేటాయించిన పోస్టుల్లో జాయిన్ రిపోర్టు పెట్టాలి. 24వ తేదీ జిల్లా నుంచి నివేదిక ఇవ్వాలి. అయితే కౌన్సెలింగ్ నిర్వహించిన తరువాత తదుపరి ప్రక్రియ అమలు చేయకుండా పెండింగ్‌లో పెట్టడంతో ఉపాధి హామీలో గందరగోళం నెలకొంది. రాజకీయ ఒత్తిడితోనే బదిలీలను అమలు చేయకుండా పెండింగ్‌లో పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. పీడీ జోసఫ్ కుమార్ ఏకంగా కమిషనర్ ఆదేశాలను ఉల్లంఘించడంపై ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు. ఈ బదిలీల్లో కూడా అనేక అవకతవకలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం.

బాలికపై లైంగిక దాడి

- పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు

కనిగిరిరూరల్: కనిగిరి పట్టణ సమీపంలోని ఓ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలికపై మండలంలోని పాతపాడుకు చెందిన పల్నాటి శివ శంకర్‌రెడ్డి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అందిన సమాచారం మేరకు ఈ నెల 23న రాత్రి 7 గంటల సమయంలో బహిర్భూమికి బయటకు వెళ్లిన బాలికపై శివ శంకర్ రెడ్డి లైంగికంగా దాడి చేశాడు. గాయాల పాలైన బాలిక విషయాన్ని తల్లికి చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై టీ శ్రీరాం కేసు నమోదు చేశారు. అనంతరం కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ అరెస్టులకు భయపడకండి

- పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుంది
- వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చెవిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకాయమ్మ, సుబ్బమ్మ

యర్రగొండపాలెం: అక్రమ అరెస్టులకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. త్రిపురాంతకం మాజీ ఎంపీపీ, మండల పార్టీ నాయకుడు ఆళ్ల ఆంజనేయరెడ్డిని కూటమి నాయకుడి ఆదేశాల మేరకు పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయాన్ని మంగళవారం ఎంపీటీసీ సభ్యురాలు, ఆంజనేయరెడ్డి భార్య సుబ్బమ్మ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 27వ తేదీ జరగబోయే మండల ప్రజా పరిషత్ ఉప ఎన్నికలో ఎంపీటీసీ సభ్యుడైన తన భర్త పార్టీ తరఫున ఎంపీపీగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారని, ఏదో ఒక రకంగా ఆయనను పోటీ నుంచి తప్పించేందుకు అక్రమ కేసులు బనాయించారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె కోరింది. ఇటువంటి అక్రమ అరెస్టులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, తనతోపాటు పార్టీ అండదండలుగా నిలుస్తుందని జగనన్న భరోసా ఇచ్చారని ఆమె 'సాక్షి'కి తెలిపింది. అక్రమంగా అరెస్ట్ అయిన ఆళ్ల ఆంజనేయ రెడ్డి విషయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంటు సభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించారు.

కూటమి నేతకు అధికారుల జీ హుజూర్

- ప్రజలతో ఎన్నికైన ఎమ్మెల్యేను కాదని పచ్చనేత చెప్పిందే వేదం
- అధికారులతో సమీక్షలు, ఆదేశాలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్



కూటమి నాయకుడు ఏర్పాటు చేసిన హౌసింగ్ సమీక్ష సమావేశంలో అధికారులు

యర్రగొండపాలెం: నియోజకవర్గంలో ఎటువంటి అధికారం లేని కూటమి నాయకుడికి అధికారులు వత్తాసు పలుకుతున్నారు. కీలకమైన పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారుల నుంచి ఇతర శాఖలకు చెందిన వారందరూ ఆయన ఆదేశాలు పాటించాల్సిందే. ప్రజలతో ఎన్నికైన ఎమ్మెల్యేను కాదని ఎన్నికల్లో ఓటమి పాలైన టీడీపీ నాయకుడి ఇంటి చుట్టూ అధికారులు తిరుగుతున్నారంటే రాష్ట్రంలో కూటమి పాలన ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. మంగళవారం కూటమి నాయకుడు మార్కాపురంలో ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహం మంజూరు చేయాలని, అనర్హులపై చర్యలు తీసుకోవాలని ఆ నాయకుడు హుకుం జారీ చేశాడు. నియోజకవర్గంలో కనీసం ఓటు కూడా లేని వ్యక్తి ప్రభుత్వ ప్రతినిధిగా ఏ విధంగా చలామణి అవుతున్నాడని, మాకు నాయకత్వం వహించే హక్కు మీకు లేదని ఎన్నికల్లో ఓటర్లు తీర్పు చెప్పినప్పటికీ పెత్తనం చేయడం ఆయనకే చెల్లిందని ఈ ప్రాంతం ప్రజలు విమర్శిస్తున్నారు. హౌసింగ్ సమీక్ష సమావేశంలో ఆ శాఖ డీఈఈ ఎస్.వి.సురేష్ బాబు, ఏఈలు అంజిరెడ్డి, జాన్‌సుందర్, శ్రావ్య, శివశంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీపీల ఉప ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్
- ఎన్నికల కమిషనర్ నీలంసాహ్నికి వినతి



నీలం సాహ్నికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

సాక్షి,అమరావతి: రాష్ట్రంలో ఈనెల 27 వ తేదీ జరగనున్న మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఉప ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. ఆమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "యర్రగొండపాలెం నియోజకవర్గంలోని త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లోని ఒక ఎంపీటీసీ, ఒక వైస్ ఎంపీపీ, ఒక కో ఆప్షన్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 27న ఎన్నికలు జరగనున్నాయి. త్రిపురాంతకం మండలంలో 18కి 18 మంది ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ వారే. ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్లపాటు ఇద్దరికి ఇచ్చాం. ఒప్పందం ప్రకారం సుబ్బారెడ్డి దిగిపోయారు. ఆయన స్థానంలో ఆళ్ల ఆంజనేయరెడ్డికి కేటాయించాం. కుట్రలతో ఆళ్ల ఆంజనేయరెడ్డి స్థానాన్ని దక్కించుకోవాలని కూటమి నేతలు చూస్తున్నారు. ఆయన్ను అక్రమంగా అరెస్ట్ చేశారు. కూటమి నేతల స్క్రిప్ట్ తో పోలీసులు కేసులు నమోదు చేశారు. నిస్సిగ్గుగా వైఎస్సార్‌సీపీ వారిని భయపెట్టి దక్కించుకోవాలని చూస్తున్నారు. ఒక్క స్థానం లేకుండా కూటమి గెలవాలని చూస్తోంది. చంద్రబాబును సూటిగా ప్రశ్నిస్తున్నాం. ఆయనకు నిజంగా రాజ్యాంగం పై నమ్మకముంటే ఏడాది తర్వాత వచ్చే ఎన్నికల్లో గెలిచి పదవులు పొందాలి. సీఎం చంద్రబాబుకు ధైర్యం లేదు కాబట్టే అక్రమ మార్గంలో గెలవాలని చూస్తున్నారు. కూటమికి ప్రజాబలం లేదు కాబట్టే ఈ తరహా తప్పుడు విధానాన్ని ఎంచుకున్నారు. ఎంపీటీసీల బలం లేకుండా ఏవిధంగా ఇక్కడ గెలవాలని చూస్తున్నారు. ఓసీ నాయకుల పై ఎస్సీలను ప్రయోగిస్తున్నారు. ప్రతి దానికి పోలీసులను అడ్డుపెడుతున్నారు. తప్పుడు కేసులు పెట్టిన పోలీసులపై న్యాయపరమైన చర్యలకు వెనకాడం. ఎంపీపీ అయ్యే వ్యక్తి మీద ఎస్సీ, ఎస్టీ కేసులు, హత్యానేరం మోపి అధికారాలను దుర్వినియోగం చేస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలి. యర్రగొండపాలెంలో పోలీసువారే ఎంపీటీసీలను బెదిరించి, పోలీసుస్టేషన్ పిలిపించి, వారిని ఎన్నికల బరి నుంచి తప్పించాలని చూస్తున్నారు. ఆ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి. చంద్రబాబు చేస్తున్న ఈ తరహా ఎన్నికల విధానాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి. గెలుపు కోసం అక్రమార్గాన్ని ఎంచుకోవడం దుర్మార్గం. ఈ ఎన్నికల విషయంలో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి. ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలను నిఘా మధ్యలో జరపాలి. సీసీ కెమెరాలు అమర్చాలి. యర్రగొండపాలెంలో జరుగుతున్న ఈ అరాచకాన్ని ఆపాలి. రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరిగేలా చూడాలి. ఎన్నికల్లో స్థానిక పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారో మాకు అర్థం కావటంలేదు. ఏ పోలీసులు ఎవరిని బెదిరించారో మా దగ్గర ఆధారాలున్నాయి. ఆధారాలన్నింటినీ ఎన్నికల కమిషనర్ కు అందజేశాం. కూటమి కుట్రలను ప్రజల సహకారంతో అడ్డుకొంటామని" తాటిపర్తి చంద్రశేఖర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకంరెడ్డి నారాయణ మూర్తి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు అసౌకర్యం లేకుండా చూడాలి

- ఏపీపీఎస్సీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: ఏపీపీఎస్సీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ పరీక్ష జరుగుతున్న ఒంగోలు నగరంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా సెంటర్‌ను మంగళవారం జాయింట్ కలెక్టర్ తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు సమయం వృథా కాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. మార్కాపురంలో కృష్ణ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల, డా.శామ్యూల్ జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఒంగోలు లోని రైజ్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్, రైజ్ కృష్ణ సాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా సెంటర్, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మంగళవారం ఉదయం పరీక్షకు 797 మంది హాజరు కావల్సి ఉండగా, 372 మంది హాజరయ్యారని, 425 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 475 మంది హాజరు కావాల్సి ఉండగా 215 మంది పరీక్ష రాశారని, 260 మంది గైర్హాజరయ్యారని జేసీ వివరించారు.

క్లుప్తంగా

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


కాశయ్య మృతదేహం

మార్కాపురం: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం మండలంలోని కోలభీమునిపాడులో జరిగింది. రూరల్ ఎస్సై అంకమరావు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దూదేకుల కాశయ్య (54)కు మద్యం అలవాటు ఉంది. గత ఐదురోజుల నుంచి భార్య నాగుల మీరమ్మ, పిల్లలను మద్యం కోసం డబ్బులు అడుగుతున్నాడు. దీంతో భార్య, పిల్లలు కాశయ్యను మందలించారు. క్షణికావేశానికి లోనైన కాశయ్య ఈనెల 24వ తేదీన మధ్యాహ్నం సమయంలో పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే ఆటోలో మార్కాపురంలోని జీజీహెచ్‌కు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

200 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

- డ్రోన్ కెమెరాలతో గుర్తింపు


నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న సీఐ


గిద్దలూరు రూరల్: మండలంలోని వేములపాడు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో 200 లీటర్ల నాటుసారా తయారీ బెల్లం ఊటను సీఐ కె.సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే.. వేములపాడు అటవీప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు సీఐ డ్రోన్ కెమెరాల సహాయంతో ఎక్కడ తయారు చేస్తున్నారో గుర్తించారు. సంఘటనా స్థలానికి చేరుకొని నాటుసారా బెల్లంఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రోన్ కెమెరాల సహాయంతో నేరాలను గుర్తించి వాటిని అదుపు చేస్తున్నామని తెలిపారు.

మింట్ కంపెనీపై చెక్ బౌన్స్ కేసు పెట్టాం

- తెలంగాణ పోలీసుల వ్యవహారంపై విజయభాస్కర్ వివరణ

ఒంగోలు టౌన్: హైదరాబాద్‌కు చెందిన మింట్ ఎన్విరాన్‌మెంట్ కంపెనీపై కోర్టులో చెక్ బౌన్స్ కేసు వేసినట్లు, దాని నుంచి తప్పించుకునేందుకు మాదాపూర్ పోలీస్‌స్టేషన్లో తప్పుడు కేసులు పెట్టారని జి. విజయభాస్కర్ తెలిపారు. చెక్ బౌన్స్ కేసులో విజయ భాస్కర్‌ను అరెస్టు చేసేందుకు తెలంగాణకు చెందిన పోలీసులు ఈ నెల 23వ తేదీన నగరంలోని బీకే అపార్ట్‌మెంటులోని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాసానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తమ్ముడు మల్లికార్జున్‌తో కలిసి 2021లో హైదరాబాద్‌కు చెందిన మింట్ ఎన్విరాన్‌మెంట్ కంపెనీలో పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. రూ.6.5 కోట్ల రుపాయలు తిరిగి ఇచ్చేందుకు ఐసీఐసీఐ బ్యాంక్‌లో అకౌంట్ తెరిచామని, అయితే ఆ డబ్బులను కంపెనీ దుర్వినియోగం చేసిందని తెలిపారు. క్రిమినల్ కేసు వేస్తామని చెప్పడంతో రూ.6.5 కోట్లకు చెక్ ఇచ్చారని, దాన్ని బ్యాంకులో వేయగా బౌన్స్ అయిందని తెలిపారు. దీనికి సంబంధించి కోర్టులో చెక్ బౌన్స్ కేసు ఫైల్ చేశామన్నారు. దాని నుంచి తప్పించుకునేందుకు నా మీద, మల్లికార్జునపై తప్పుడు కేసు నమోదు చేశారన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

కొత్తపట్నం: వేసవిలో ఉపాధి లేక ఇంటికే పరిమితం అవుతున్నారని, కూలీలకు 100 రోజుల ఉపాధి కల్పించడానికి సిబ్బంది కృషి చేయాలని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీకృష్ణ అధ్యక్షత వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో వేసిన మామిడి మొక్కలు ఎండిపోవడంపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజుపాలెంలో 2018–19లో నిర్మించిన మినీ గోకులంలో శ్లాబ్ వేయకుండా వేసినట్లు బిల్ చేయడంపై మండిపడ్డారు. బాధ్యుల నుంచి నగదు రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి కూలీలకు పని కల్పించి రోజుకు రూ.300 కూలి వచ్చేలా చూడాలని సూచించారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న అన్నా ట్యాంకు చెరువు చుట్టూ మరమ్మతులు చేసి చెట్లు నాటాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రత్నజోత్స్న, జేఈ చంద్రశేఖర్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జూదం.. జీవితం ఛిద్రం



స్మార్ట్‌ఫోన్ ప్రపంచాన్ని చేతిలోకి తీసుకువచ్చింది. మంచి, చెడూ రెండూ ఉండే ఈ స్మార్ట్ ఫోన్‌ను అధిక శాతం యువత చెడుకే ఉపయోగిస్తున్నారు. ఫలితంగా జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ జూదాలు, బెట్టింగ్ యాప్‌లను ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని ఆశకు పోయి అప్పులు చేసి వాటిలో పెట్టి అప్పుల ఊబిలోకి కూరుకుపోయి బతుకు చాలిస్తున్న సంఘటనలూ జిల్లాలో లేకపోలేదు. ఇప్పటికే గంజాయి, మట్కా ఊరిస్తుంటే..మరో పక్క ఆన్‌లైన్ జూదం యువతను వ్యసనపరులను చేసి జీవితాన్ని బలితీసుకునేలా చేస్తున్నాయి.

- ఆన్‌లైన్ జూదాలు, బెట్టింగ్ యాప్‌లతో యువత పెడదారి
- ఆశపడి డబ్బులు పెట్టి అప్పులపాలు
- పల్లెలకూ మట్కా గాంబ్లింగ్
- గుట్టుచప్పుడు కాకుండా గంజాయి దందా

కంభం:

చెడు వ్యసనాలకు బానిసలై, త్వరగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో ఎంతో మంది యువకులు మట్కా, పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర ఆన్‌లైన్ జూదాలకు బానిసలుగా మారి వారి భవిష్యత్‌ను నాశనం చేసుకోవడమే కాక కొన్ని సార్లు కటకటాల పాలవుతున్నారు.

మట్కా మత్తు..

కంభంలో కొన్ని రోజులుగా మట్కా జోరుగా సాగుతోంది. నాలుగు రోజుల క్రితం కంభం ఎస్సై నరసింహారావు పట్టణంలోని పలు ప్రాంతాల్లో దాడులు చేసి సుమారు 20 మందికి పైగా మట్కారాయుళ్లను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న వారిని, మట్కా నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరిస్తున్నారు. మట్కా ఆడే వారి మొబైల్స్, కాల్‌డేటా, బ్యాంకు లావాదేవీలను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పూర్తి స్థాయిలో విచారణ చేసి మట్కా ముఠాలను అదుపులోకి తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

చాయ్ కేఫ్‌లే కేరాఫ్‌గా..

స్థానిక హైవే రోడ్డులో ఇటీవల కాలంలో వరుసగా ఛాయ్ సెంటర్లు ఏర్పడ్డాయి. ఒక్కో కేఫ్‌లో 50 నుంచి 100 వరకు కుర్చీలు వేస్తుండటంతో యువకులు, విద్యార్థులు అక్కడే ఎక్కువ సమయం గడుపుతున్నారు. దీనికి తోడు ఐపీఎల్ ప్రారంభం కావడంతో దుకాణదారులు పెద్ద పెద్ద టీవీలు, ప్రొజెక్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. యువత అక్కడ కూర్చోని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. విద్యార్థులు సైతం కాలేజీలు డుమ్మాకొట్టి అక్కడే ఎక్కువ సమయం గడుపుతున్నారు.


గంజాయి


సిగరెట్లలోకి గంజాయిపొడిని ఎక్కించుకుంటున్న దృశ్యం

ఆగని గంజాయి దందా

పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు నియోజకవర్గంలో గంజాయి దందా జోరుగా సాగుతోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం గంజాయికి బానిసలవుతున్నట్లు తెలిసింది. గంజాయి మత్తు సరిపోని కొందరు అంతకు మించిన మత్తు కోసం మెడికల్ షాపుల్లో లభించే జోల్‌ఫ్రెష్ (మత్తు మందులు)ట్యాబ్లెట్స్, ఇతర మత్తు మాత్రలు కొనుగోలు చేసి వాటిని కూల్‌డ్రింక్స్‌లో కలుపుకొని తాగి మత్తులో తూగుతూ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. వీటి ద్వారా వచ్చే మత్తు రెండు రోజుల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఇటీవల కాలంలో డ్రగ్ అధికారులు పలు మెడికల్ షాపుల్లో దాడులు చేసి కేసులు సైతం నమోదు చేశారు. గిద్దలూరు, కనిగిరి, నంద్యాల, యర్రగొండపాలెం, ఇతర ప్రాంతాల నుంచి తెప్పించిన గంజాయిని తెప్పించి కంభంలోని నక్కలగండి తూము వద్ద రైల్వే బ్రిడ్జి వద్ద, హైవే రోడ్డులోని యుటర్న్ సమీపంలోని 30 అడుగుల రోడ్డు చివరలో స్థావరాలు ఏర్పాటు చేసుకొని అక్కడి నుంచి ఇతరులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ నెల 11వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద గంజాయిని తరలిస్తున్న కొందరిని అక్కడి పోలీసులు పట్టుకోగా అందులో కంభం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు చిక్కినట్లు తెలిసింది.

లాడ్జిలే అడ్డాగా..

పట్టణంలో హైవే రోడ్డులోని కొన్ని లాడ్జిలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. లాడ్జిలను ఎక్కువ మంది మద్యం సేవించడానికి, పేకాట, ఇతర కార్యక్రమాలకే వినియోగించుకుంటున్నట్లు తెలుస్తుంది. గంజాయి, ఇతర ఏ నేరాలు జరిగినా దానికి కారకులైన వారు లాడ్జిలలో ఉండి పనులకు పథకాలు రచించుకుంటున్నట్లు తెలుస్తుంది. గతంలో కూడా గంజాయి కేసు, మత్తు ట్యాబెట్ల కేసులో పలువురు యువకులు పోలీసులకు ఓ లాడ్జిలో పట్టుబడిన సందర్భాలున్నాయి. లాడ్జిలలో రిజిస్టర్లలో సక్రమంగా వివరాలు పొందుపరచకపోవడంతో పోలీసులకు సమాచారం అందడం కష్టతరంగా మారుతుంది.

> **చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు:**
> ఎవరైనా మట్కా, పేకాట, బెట్టింగ్, గంజాయి ఇతర చట్ట వ్యతిరేక పనులు చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మొబైల్ ఫోన్‌లో జూదాలకు సంబంధించిన యాప్‌లు డీలిట్ చేసినా ఎవరూ తప్పించుకోలేరు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తప్పు చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తెలిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. లాడ్జిల నిర్వాహకులు రిజిస్టర్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి.
> – నరసింహారావు, కంభం ఎస్సై


హైవే రోడ్డులో ఓ చాయ్ కేఫ్‌లో కూర్చొని ఉన్న యువకులు

వైఎస్ జగన్‌ను కలిసిన ఎంపీటీసీలు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అన్నా రాంబాబు, ప్రజాప్రతినిధులు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, ముఖ్య ప్రజాప్రతినిధులు, నాయకులు కలిశారు. పార్టీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు తదితరులు ఉన్నారు. వీరి వెంట ఎంపీపీ లక్ష్మీదేవీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు దేవండ్ల లక్ష్మమ్మ, లయోల చెంచిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రఫీ, పలువురు ఎంపీటీసీలు ఉన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ పేరుతో మోసం


మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబు

ఒంగోలు టౌన్: ఎన్నికలకు ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ఫైలుపై తొలి సంతకం చేస్తానని చెప్పిన చంద్రబాబు...అధికారంలోకి వచ్చి 9 నెలల గడుస్తున్నా నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిరుద్యోగ యువకులను మోసం చేస్తున్నారని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు విమర్శించారు. ఎల్బీజీ భవన్‌లో భగత్‌సింగ్ మంగళవారం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుంటా రోజుకో మాట మారుస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ తరువాత నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఒకసారి, ఎమ్మెల్సీ కోడ్ అయిపోయాక విడుదల చేస్తామని మరోసారి, ఆ తరువాత మార్చి అని, ఇప్పుడు ఏప్రిల్ అని చెబుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇలా ఎంతకాలం మోసం చేస్తుంటారని ప్రశ్నించారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే అనేక మంది అభ్యర్థులు డీఎస్సీపై ఆశతో అప్పులు చేసి ఫీజులు చెల్లించి కోచింగ్ తీసుకుంటున్నారని, సకాలంలో నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో కోచింగ్ ఫీజుల భారం భరించలేక అల్లాడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పి. దేవ, వాసు శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దద్దాల


వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిశారు. పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులతో పాటు, కూటమి ప్రభుత్వం నేతలు అకారణంగా కనిగిరిలో ముగ్గురు సర్పంచ్‌ల చెక్ పవర్‌లను రద్దు చేసి ఇబ్బందులు పెడుతున్న విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. లింగంకుంట్ల సర్పంచ్ నాగరత్తాలు తన చెక్ పవర్ రద్దు చేసిన విషయాన్ని విన్నవించారు. అన్ని విధాలా అండగా ఉంటామని జగనన్న భరోసా ఇచ్చినట్లు దద్దాల నారాయణ తెలిపారు. ఎంపీపీ గాయం సావిత్రి, మాజీ ఎంపీపీలు గాయం బలరాంరెడ్డి, గాయం ఈశ్వరమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మద్ది తిరుపతయ్య, సర్పంచ్‌లు నాగరత్తాలు, సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, దిరిశనం పిచ్చిరెడ్డి, యారవ వెంకటరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, చిట్యాల నాగార్జునరెడ్డి, మోరా అంజనేయ రెడ్డి, మోరా సాంబ, శ్యామల సాంబిరెడ్డి, మద్ది శ్రీకాంత్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, పాశం కొండయ్య, ఇండ్ల శ్రీకాంత్, ఈర్ల శ్రీను, కంటు కేశవ, షబ్బీర్, పెద్ద ఖాజా తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల కో ఆర్డినేటర్ విచారణ

ఒంగోలు వన్‌టౌన్: గురుకుల పాఠశాలల సంయుక్త కార్యదర్శి రాజ్యలక్ష్మి మంగళవారం ఒంగోలులోని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో విచారణ నిర్వహించారు. టెట్ అర్హత పరీక్ష లేకుండా గతం నుంచి కొంత మంది అక్రమంగా ఉద్యోగాలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదు మేరకు విచారించారు. అవసరమైన ఫైల్స్‌ను పరిశీలించారు.

ఎన్నికల్లో గెలిచే సత్తా లేకనే అక్రమ అరెస్టులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


జిల్లా జైలు వద్ద విలేకరులతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు టౌన్:


స్థానిక ఎన్నికల్లో గెలిచే సత్తా లేకపోవడం వల్లనే వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఆంజనేయ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి విమర్శించారు. జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి మంగళవారం జిల్లా జైలులో ఉన్న ఎంపీటీసీ ఆంజనేయ రెడ్డిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక ఎంపీపీ కోసం డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలను రంగంలోకి దించి హైడ్రామా సృష్టించి అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఒక వ్యక్తిని అడ్డుకున్నాడని చెప్పి ఎంపీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆంజనేయ రెడ్డి మీద ఎస్సీ అట్రాసిటీ కేసుతో పాటుగా గొడ్డలితో దాడికి దిగినట్లు 307 కేసు పెట్టారని తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తే గొడ్డలి కానీ, చిన్న గాయం కానీ లేదని, ఫిర్యాది గాయపడితే ఆస్పత్రిలో చేరడం కూడా జరగలేదని చెప్పారు. ఎస్సీ అట్రాసిటీ కేసులో డీఎస్పీ విచారణ చేయాలని, చుట్టుపక్కల వారిని విచారించాలని ఇతర నియమ నిబంధనలను పాటించకుండా కక్షపూరితంగా అరెస్టు చేశారన్నారు. ఆంజనేయ రెడ్డిని అర్ధరాత్రి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి కూర్చోబెట్టి మరుసటి రోజు అరెస్టు చేసినట్లు చూపడం దుర్మార్గం అన్నారు. కావాలనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీకి 18 మంది ఎంపీటీసీలు ఉంటే టీడీపీ అభ్యర్థి ఎంపీపీ అయ్యే ఛాన్స్ లేదని, అందుకే కుట్రలకు పాల్పడుతున్నారని చెప్పారు. స్థానిక టీడీపీ ఇన్‌చార్జితో కలిసి డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను రంగంలోకి దించి అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని హేళన చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను తీసుకెళ్లి దాచిపెట్టి ఎంపీపీ కావాలనుకోవడం అమానుషం అన్నారు. ఆంజనేయరెడ్డి విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: సైబర్ నేరాల కట్టడి విషయంలో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వర రావు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాలపై పోలీసు సిబ్బందికి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సైబర్ నేరాలపై ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఐటీ కోర్ సిబ్బంది అందించే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ఓటీపీ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఉద్యోగాల పేరిట ప్రజలను మోసం చేయడం గురించి వివరించారు. మోసాలకు పాల్పడే నేరగాళ్లకు శిక్షలు పడేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. పిటిషన్ మేనేజ్‌మెంట్, ఎఫ్ఐఆర్ మేనేజ్‌మెంట్, స్టేషన్ మేనేజ్‌మెంట్, క్రిమినల్ ఇంటిలిజెన్స్‌లో మెళకువలను నేర్పించనున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు 1930 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కంభం సీఐ మల్లికార్జునరావు, ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు, కొండపి సీఐ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దర్శి డీఎస్పీకి సేవా పురస్కారం



డీఎస్పీని సత్కరిస్తున్న పోలీస్ సిబ్బంది

దర్శి: డీఎస్పీ లక్ష్మీనారాయణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ సేవా పురస్కారాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఇలాంటి మరెన్నో పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐ రామారావు, ఎస్సైలు మురళీ, మల్లికార్జునరావు, ఏఎస్సైలు రాంబాబు, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.